క్లుప్తంగా

గిరిజన బాలిక ప్రతిభ



పతకాలు, ప్రశంసాపత్రాలతో లేష్యశ్రీ

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామ పంచాయతీ పాయం మంగయ్య గుంపు గ్రామానికి చెందిన పాండ్రు లేష్యశ్రీ ఆర్చరీ విద్యలో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ఇటీవల ఆసిఫాబాద్ జిల్లా ఉట్నూరులో జరిగిన 7వ ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్‌లో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. కిన్నెరసానిలో జరిగిన 4వ తెలంగాణ స్టేట్ లెవల్ ట్రైబల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ కనబరిచి రెండో స్థానంలో నిలిచింది. రజత పతకం గెలుచుకుంది. లేష్యశ్రీ కాచనపల్లిలో స్పోర్ట్స్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది.

ఆ భూములను పేదలకు పంచాలి

అశ్వారావుపేట: ఎఫ్‌డీసీ (అటవీ అభివృద్ధి సంస్థ)ను తక్షణమే రద్దు చేసి, ఈ సంస్థ ఆధీనంలో ఉన్న విలువైన భూములను నిరుపేదలకు పంపిణీ చేయాలని ఆదివాసీ జీవన విధానం వ్యవస్థాపకుడు పి.క్రాంతి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఈ సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కృష్ణ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎఫ్‌డీసీ సంస్థ ఆధీనంలో జమాయిల్, వెదురు వంటి వాణిజ్య పంటలు వేసి భూసారాన్ని దెబ్బతీస్తున్నారని, వెంటనే ఆ భూములను నిరుపేదలకు పంచాలని డిమాండ్ చేశారు. సోయం బాబూరావు, తాటి రవి, సోడె స్వరాజ్, సున్నం నాగరాజు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై కళాజాతా

మణుగూరురూరల్: పట్టణంలోని సురక్షా బస్టాండ్, పూలమార్కెట్ సెంటర్లలో పోలూరి రాము జానపద కళాబృందం కళాజాతా ప్రదర్శన నిర్వహించింది. ఈ జాతాలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ సోకడం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, ఏఆర్‌టీ మందుల ఆవశ్యకతపై కళాబృందం సభ్యులు గేయాల రూపంలో ప్రజలకు వివరించారు. సలహాలకు, సందేహాల నివృత్తి కోసం 1097టోల్ ఫ్రీ నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గాడ్స్ థెరిసా మహిళా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ వట్టి సాగర్‌రెడ్డి, సీహెచ్ నాగేంద్ర, పీర్ ఎడ్యుకేటర్స్ రజిని, నీరజ, ఝాన్సీ, ప్రసన్న, నాగలక్ష్మి, కళాకారులు రాము, గుడిపల్లి పుల్లారావు, ఆరింపుల సతీష్, కొచ్చర్ల గురవయ్య, లలిత తదితరులు పాల్గొన్నారు.

'క్రెటా' ఆవిష్కరణ

మణుగూరురూరల్: పట్టణంలోని భారత్ హ్యుందాయ్ షోరూమ్‌లో నూతన హ్యుందాయ్ క్రెటా కారును మణుగూరు డీఎస్పీ ఎస్‌వి.రాఘవేంద్రరావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూమ్ మేనేజర్ అశోక్‌కుమార్ క్రెటా కారు యొక్క ఫీచర్స్‌ను వివరించారు. కార్యక్రమంలో మణుగూరు సీఐ ఎ.రమాకాంత్, ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ రాములు, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

రామయ్యకు వినతి

భద్రాచలంటౌన్: గొల్కొండ నవాబుకు కలలో ప్రత్యక్షమై భక్త రామదాసును విడిపించినట్లు ప్రధాని నరేంద్ర మోదీ చట్ట సభల్లో బీసీ వాటా బిల్లు పెట్టడానికి ధైర్యం ప్రసాదించాలని హిందూ బీసీ మహాసభ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భద్రాద్రి రామయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు సిద్దేశ్వర్లు మాట్లాడారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు పర్వత సతీష్ కుమార్, చింతలగారి వెంకటస్వామి, కొంగర నరహరి, బత్తుల రాం నర్సయ్య, పంతుల మల్లయ్య, ఆది సంజీవ, విజయ్‌కుమార్, సత్యనారాయణ, వీరస్వామి, అంజేయులు పాల్గొన్నారు.

జీవనభృతి కల్పించాలి

అశ్వారావుపేట: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఉపాధి కోల్పోయిన ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ప్రభుత్వం జీవనభృతి కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ముత్తేశ్వర రావు, శ్రీను పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలే నివాళి

భద్రాచలంఅర్బన్: కష్టకాలంలో ప్రజా పోరాటాలను ముందుకు తీసుకుపోవడమే బండారు శ్రీదేవికి తామిచ్చే ఘన నివాళి అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. సీపీఎం సీనియర్ నాయకుడు తిలక్ సతీమణి, ఐద్వా సీనియర్ నాయకురాలు దివంగత బండారు శ్రీదేవి వర్ధంతి సభ బెల్లంకొండ కుసుమ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీదేవి చిత్రపటానికి మచ్చా వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎంబి.నర్సారెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు బీబీజీ తిలక్, ఐద్వా సీనియర్ నాయకులు నాదెళ్ల లీలావతిలు పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో మచ్చా వెంకటేశ్వర్లు, ఐద్వా పట్టణ కార్యదర్శి డి.సీతాలక్ష్మిలు మాట్లాడారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రాణ ప్రతిష్ఠతో ఉత్సవాలు

అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాన్ని పురస్కరించుకుని పలు ప్రాంతాల్లోని దేవాలయాల్లో సోమవారం ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భజనలు, రామకీర్తనలతో ఆ ప్రాంతాలు మారుమోగాయి. ఆపై ఆలయ ప్రాంగణాల్లో అన్నదానం ఏర్పాటు చేశారు. మరోవైపు, వివిధ సంస్థల ఆధ్వర్యంలో భక్తులు శ్రీరాముడి జెండాలతో బైక్ ర్యాలీలు, శోభాయాత్రలు నిర్వహించారు. టపాసులు పేల్చి సంబురాలు జరుపుకున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పూజాధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేటరూరల్: వినాయకపురంలో కోలాటం ఆడుతున్న మహిళలు



దమ్మపేట: సగర దండు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ..



మణుగూరురూరల్: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఎస్పీ రాఘవేంద్రరావు



చర్ల: సీతారామ లక్ష్మణ భక్తాంజనేయస్వామి ఆలయంలో భక్తుల పూజలు..



బూర్గంపాడు: సాకేతపురి ఆంజనేయస్వామి మందిరంలో కరసేవకులకు సన్మానం..



దుమ్ముగూడెం: లక్ష్మీనగరం ఆలయంలో హనుమాన్ చాలీసా పఠిస్తున్న భక్తులు



భద్రాచలంఅర్బన్: విప్ప మొక్క నాటుతున్న గ్రీన్ భద్రాద్రి సభ్యులు



పినపాక: రామ కీర్తనలతో యాత్ర చేపట్టిన మహిళలు



చంద్రుగొండ: అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై రవి



అశ్వారావుపేటరూరల్: నందమూరినగర్‌లో స్క్రీన్‌పై వీక్షిస్తున్న రామభక్తులు



అన్నపురెడ్డిపల్లి: రామాలయంలో భజన చేస్తున్న భక్తులు



గుండాల: మండల కేంద్రంలో ద్విచక్రవాహనలతో ర్యాలీ..



అశ్వాపురం: ఆనందాపురం రామాలయంలో ఎంపీపీ సుజాత, గ్రామస్తుల అన్నదానం..



భద్రాచలం: వివిధ వేషధారణల్లో చిన్నారులు



భద్రాచలం: వెండి విగ్రహాలతో హైదరాబాద్‌కు చెందిన భక్తులు, ఈఓ రమాదేవి

రైతులకు చేదోడుగా క్రీడాప్రాంగణం!

కరకగూడెం: గ్రామీణ యువతకు క్రీడా స్ఫూర్తినిచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు పలువురు రైతులకు కూడా ఉపయోగ పడుతున్నాయి!. వివిధ రకాల పంట ఉత్పత్తులను క్రీడా ప్రాంగణాల్లో రైతులు నిల్వ ఉంచుకోవడం, ఆరోబోసుకోవడం వంటి కార్యక్రమాలు చేస్తున్నారు. అక్కడి నుంచే నేరుగా విక్రయాలు జరుపుతున్నారు. ఈ క్రమంలో సోమవారం కరకగూడెం మండలంలోని పద్మాపురం గ్రామ క్రీడా ప్రాగణంలో ఓ రైతు వరి ధాన్యం విక్రయిస్తుండగా 'సాక్షి' తన కెమెరాలో ఆ దృశ్యాలను బంధించింది.



క్రీడాప్రాంగణంలో నిల్వ ఉంచిన వరి ధాన్యం బస్తాలు

గురుకులంలో వైద్యశిబిరం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర కళాశాలలో ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎస్‌ఓ ఎస్తేర్‌రాణి, హెచ్‌ఈఓ కృష్ణయ్య, హెచ్‌వీ శారారాణి, ఏఎన్‌ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



కరకగూడెం: ప్రతిష్ఠించిన ఆంజనేయ స్వామి విగ్రహం

కరకగూడెం: మండలంలోని భట్టుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గుబ్బల మంగమ్మ సన్నిధానంలోని ప్రధాన రహదారి పార్కు వద్ద ఆలయ కమిటీ అధ్యక్షుడు కోటగిరి సతీష్, సర్పంచ్ తొలేం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. హోమాలు, పూజల నడుమ అబీజిత్ లగ్నం పురస్కరించుకుని 12:32 నిమిషాలకు వేద పండితులు విగ్రహ ప్రతిష్ఠను చేపట్టారు. భట్టుపల్లి రామాలయ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అభయాంజనేయ ఆలయంలో వసతులను కల్పించడానికి దాతలు ముందుకు రావాల్సిందిగా ఆలయ కమిటీ అధ్యక్షుడు, సర్పంచ్ కోరారు.

అశ్వాపురంలో..

అశ్వాపురం: మండల కేంద్రంలో కాలువ బజార్‌లోని శ్రీ షిరిడి సాయినాథుని ఆలయంలో సోమవారం అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ ధర్మకర్త నల్లగట్ల సత్యప్రకాష్, ఎంపీపీ ముత్తినేని సుజాత, వేములపల్లి రమేష్, గద్దల రామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ

గుండాల: మండలంలోని పడుగోనిగూడెంలో ఏటీఎఫ్ 2024 క్యాలెండర్‌ను ఎంఈఓ పెండెకట్ల కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ రోజు పాఠశాలకు రావాలని, గైర్హాజరు కావొద్దని సూచించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి కుంజ కృష్ణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఊకె కృష్ణ, జిల్లా కార్యదర్శి మోహన్‌రావు, అంజయ్య, ఆదినారాయణ, శ్రీరాములు, వెంకటేష్, రామకృష్ణ, ఎల్లయ్య, మంజుల, అనురాధ, రామేశ్వరి, తులశమ్మ తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు

మణుగూరురూరల్: మణుగూరు–ఏటూరు నాగారం ప్రధాన రహదారికి సంబంధిత అధికారులు మరమ్మతు పనులు నిర్వహిస్తున్నారు. గత కొంతకాలంగా వాహనదారులు, ప్రయాణికులు గుంతలమయంగా మారిన ఈ రహదారి వల్ల అనేక ఇబ్బందులు పడ్డారు. దీనిపై సాక్షిలో కథనాలు సైతం ప్రచురితమయ్యాయి. కాగా మేడారం జాతర నేపథ్యంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రహదారికి మరమ్మతులు చేయాలని ఆర్‌అండ్‌బీశాఖ అధికారులను ఆదేశించడంతో పనులు కొనసాగుతున్నాయి.

క్వింటాకు రూ.30 వేలు చెల్లించాలి

చర్ల: రైతులు సాగు చేసిన మిర్చి పంటలకు చీడపీడలు ఆశించి రైతాంగం తీవ్రంగా నష్టపోతున్న తరుణంలో మిర్చి పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, క్వింటాకు రూ.30 వేలు చెల్లించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా నాయకుడు కెచ్చెల రంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని డీవీకే భవన్‌లో పార్టీ సీనియర్ నాయకులు పాలెం చుక్కయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మండల కమిటీ సభ్యులు సుజాత, కల్యాణ్ పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

దమ్మపేట: వేగవంతమైన ప్రపంచంలో ప్రతీ విద్యార్థి నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. సోమవారం మండలంలోని నాగుపల్లి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, వేకువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జీవితంలో వృత్తిపరంగా స్థిరపడటానికి నైపుణ్యాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని వివరించారు. అంతకుముందుగా శ్రీరాంపురం గ్రామంలోని రామాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు. నాగుపల్లి పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారాన్ని ఎమ్మెల్యే స్వయంగా వడ్డించి, వారితో కలసి అల్పాహారం తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కీసర లక్ష్మి, ఎంపీపీ సోయం ప్రసాద్, స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే..

ములకలపల్లి: మండలపరిధిలోని మామిళ్లగూడెం గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొన్నారు. స్థానిక కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జారేను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేశారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బత్తుల అంజి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, పేటేటి నర్సింహారావు, కోరంపల్లి చెన్నారావు, బుగ్గారపు సత్యనారాయణ, కొప్పుల రాము, సురభి రాజేష్, పాలకుర్తి రవి పాల్గొన్నారు.



దమ్మపేట: నాగుపల్లి పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

నూతన ఎస్సైగా వెంకటప్పయ్య



పినపాక: ఈ బయ్యారం నూతన ఎస్సైగా సోమవారం టి.వెంకటప్పయ్య బాధ్యతలు స్వీకరించారు. ఎస్పీ ఆఫీసులో విధులు నిర్వహిస్తున్న వెంకటప్పయ్యను బయ్యారానికి బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న నాగుల్ మీరాను ఎస్పీ ఆఫీస్‌కు సరెండర్ చేశారు. అనంతరం నూతన ఎస్సై మాట్లాడుతూ.. మండలంలో లా అండ్ ఆర్డర్‌ను బాధ్యతాయుతంగా నిర్వహిస్తానని, చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటి వారినైనా వదిలేది లేదని అన్నారు.

చర్ల వైద్యాధికారిగా సాయి వర్ధన్



చర్లరూరల్: చర్ల సీహెచ్‌సీ వైద్యాధికారిగా డాక్టర్ బూరుగడ్డ సాయి వర్ధన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకాలం దంత వైద్యులతోనే కాలం వెళ్లదీసిన ప్రభుత్వ యంత్రాంగం.. ఎట్టకేలకు చర్ల సీహెచ్‌సీకి ఎంబీబీఎస్ వైద్యుడిని నియమించింది.

భక్తులకు పండ్లు పంపిణీ

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీరామచంద్ర స్వామివారి ఆలయ పరిసరాల్లోని భక్తులకు సోమవారం ఓ భక్తుడు జామకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా కామవరపుకోట మండలం సాగిపాడుకు చెందిన నాగరాజు అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా తన తోటలో పండించిన రెండు క్వింటాల జామ కాయలను భక్తులకు పంపిణీ చేశాడు.

జీపీ భవనానికి శంకుస్థాపన

అశ్వాపురం: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామ పంచాయతీలో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ మడకం సాధు, ఉపసర్పంచ్ అంకుష్‌ఆలీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలలో క్రీడా పోటీలు

కరకగూడెం: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో సోమవారం నిర్వహించిన క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల హెచ్‌ఎం మంజుల క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. పోటీల్లో తొలిరోజు విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్ తదితర క్రీడల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పీఈటీ కె.రఘు, ఉపాధ్యాయులు లక్ష్మణ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు ఇవ్వాలి

అశ్వాపురం: పినపాక నియోజకవర్గంలో గత ప్రభుత్వం అక్టోబర్ నెలలో మంజూరు చేసిన దళితబంధు నిధులను లబ్ధిదారులకు అందించాలని బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ పినపాక నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌లో జిల్లా కలెక్టర్ ప్రియాంక అలకు వినతిపత్రం అందజేశారు. ఎలక్షన్ కోడ్‌తో ఆగిపోయిన నిధులనువిడుదల చేసి పంపిణీ చేయాలని కోరారు.

దుమ్ముగూడెం: మండలంలో రెండో విడత మంజూరైన దళితబంధు లబ్ధిదారులకు న్యాయం చేయాలని, వెంటనే యూనిట్లను గ్రౌండింగ్ చేయాలని కోరుతూ సోమవారం లబ్ధిదారులు ఎంపీడీఓ ముత్యాలరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దళితబంధు లబ్ధిదారులు కాల్వ పూర్ణయ్య, దామెర్ల శ్రీనివాసరావు, పొడుతురి నాగరాజు,జిలకర గంగరాజు, దేగల రవి, ఈటె సమ్మయా, పిట్టా పూర్ణయా, రాయపూడి పుష్పరాజు,అనిల్, జెట్టి రామకృష్ణ, రాజు, గణేష్, బీఆర్‌ఎస్ నాయకులు కెల్లా శేఖర్, రామిరెడ్డి పాల్గొన్నారు.

కూనవరం జీపీలో గ్రామసభ

మణుగూరురూరల్: మండల పరిధిలోని కూనవరం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. పంచాయతీ పరిధిలోని ఏ సమస్యలున్నా సభ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సభలో వార్డు సభ్యులు కలగూర శంకర్, ఎలిబోయిన సురేష్, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

వాయిదా పడిన గ్రామసభ

దమ్మపేట: మండల కేంద్రం దమ్మపేట గ్రామ పంచాయతీలో సోమవారం నిర్వహించాల్సిన గ్రామసభను వాయిదా వేశారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో సభను ప్రారంభించగా.. సర్పంచ్, ఉపసర్పంచ్‌లు హాజరుకాలేదు. దీంతో వార్డు సభ్యులు, సీపీఐ నాయకులు, గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్, ఉపసర్పంచ్‌లు రానిపక్షంలో సభను బహిష్కరిస్తామని వాదనకు దిగారు. ఈ కారణంగా గ్రామసభను తాత్కాలికంగా రద్దుపరుస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ప్రకటించారు. తిరిగి గ్రామసభను ఈ నెల 25న నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.



మణుగూరురూరల్: సభలో మాట్లాడుతున్న ఎంపీటీసీ కోటేశ్వరరావు

వాహనదారులు నిబంధనలు పాటించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ తోట తిరుపతి

భద్రాచలంటౌన్: రహదారులపై వాహనాలు నడిపే సమయంలో వాహనదారులు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమ నింబంధనలు పాటించాలని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ తోట తిరుపతి అన్నారు. కూనవరం రోడ్డులోని రవాణా శాఖ కార్యాలయంలో 35వ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం వాహనదారులకు, డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. ద్విచక్రవాహనదారులకు పలు రక్షణ చర్యలు సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఉషారాణి, టెక్నీషియన్ యాకూబ్ పాషా, భాస్కర్ సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహ దాతకు సన్మానం

గుండాల: మండల కేంద్రంలో రామాలయం వద్ద నిర్మించబోయే ఆంజనేయ స్వామి విగ్రహ దాతను ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఘనంగా సన్మానించారు. 33 అడుగుల ఎత్తులో ఆంజనేయ స్వామి విగ్రహం నిర్మించేందుకు ముందుకొచ్చిన మండల కేంద్రానికి చెందిన పట్వారీ వెంకన్న–హరిప్రియ దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు సన్మానం చేశారు.

కనుల పండువగా విగ్రహాల ఊరేగింపు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సీతారామాలయంలో ప్రతిష్ఠించే విగ్రహాలను సోమవారం ప్రధాన రహదారి, గ్రామ పురవీధుల్లో కన్నుల పండువలా ఊరేగించారు. సీతారాములు, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి విగ్రహాలు ఏపీలోని కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ నుంచి ఇక్కడికి చేరాయి. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో మహిళలు, యువతులు కోలాట నృత్యాలల నడుమ ఊరేగించారు. కార్యక్రమంలో ఉప్పల ప్రసాద్, నల్లపు నరసింహారావు, జల్లిపల్లి విస్సు, మారుతీ లక్ష్మణరావు, ఉప్పల మురళి, బిర్రం వెంకటేశ్వరరావు, నల్లపు గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



అశ్వారావుపేటరూరల్: వినాయకపురంలో విగ్రహాలను ఊరేగిస్తున్న రామభక్తులు